క్లుప్తంగా

మోతె వాగుపై చెక్‌డ్యాంలను పునః నిర్మించాలి


ఎమ్మెల్యే సత్యంను సన్మానిస్తున్న గ్రామస్తులు

రామడుగు: మండలంలోని మోతె వాగుపై చెక్ డ్యాంలను పునఃనిర్మించాలని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంను బాధిత రైతులు కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం మోతె వాగులో చెక్‌డ్యాముల నిర్మాణంతో దాదాపుగా 20 మంది రైతులకు చెందిన 30 ఎకరాలకు పైగానే పంట పొలాలు పూర్తిగా కొట్టుకుపోవడం జరిగిందని, దీంతో రూ.పదికోట్ల మేర రైతులకు నష్టం కలిగిందని ఎమ్మెల్యేకు తెలిపారు. పంట పొలాలు తిరిగి మట్టితో నింపి సాగు చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో మోతె గ్రామానికి చెందిన బాధిత రైతులు ఊకంటి విజేందర్ రెడ్డి, మధు, శేఖర్, మహేశ్, భువన్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోల రమేశ్, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్ పాల్గొన్నారు. కాగా రైతులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను శాలువా కప్పి సన్మానించారు.

దళితబంధు లబ్ధిదారులు అధైర్యపడొద్దు

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక : దళితబంధు రెండోవిడత లబ్ధిదారులు అధైర్యపడి ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడకూడదని, అండగా ఉంటానని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. దళితబంధు రాలేదని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండల కేంద్రానికి చెందిన గాజుల అమల ఇంటికి బుధవారం వెళ్లి పరామర్శించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో రెండో విడుత దళితబంధు లబ్ధిదారుల కుటుంబాలకు డబ్బులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి నియోజకవర్గంలో దళితులకు దళిత బంధు ఇవ్వాలన్నారు. కలెక్టర్, మంత్రుల రివ్యూ సమావేశంలో విజ్ఞప్తి చేశామని, ఫ్రీజ్ ఎత్తివేసి నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లతశ్రీనివాస్, మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి, మాజీ ఉప సర్పంచ్ వొరం భానుచందర్, గెల్లు ఐలుకోంరయ్య, నాయకులు పాల్గొన్నారు.

11,12వ తేదీల్లో మహాసభలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రామడుగు: ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈ నెల 11, 12వ తేదీల్లో నిర్వహించే ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర విద్య–వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ సీనియర్ నాయకులు, రామడుగు మండల ఇన్‌చార్జి ఆర్కాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో బుధవారం మహాసభల వాల్ పోస్టర్‌ను సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... అందరికీ సమాన విద్య అంతరాలు లేని కామన్ స్కూల్ విధానం అందజేసినప్పుడే సమసమాజ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. మహాసభలకు భారీగా ఉపాధ్యాయులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు శైలజ, టీచర్లు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి'

హుజూరాబాద్: దళితుల సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే ప్రధాని మోదీ హామీ ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే ప్రస్తుత పార్లమెంట్ ముగింపు సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరిపాటి వేణు డిమాండ్ చేశారు. ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి ఆదేశాల మేరకు బుధవారం హుజూరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రధాని హామీ మేరకు వర్గీకరణపై కమిటీని ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని కమిటీ కార్యాచరణ, విధి విధానాలు ఇప్పటికీ తెలియవన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని, ఉపకులాలన్నింటిని 'ఏ'వర్గంలో చేర్చి సామాజిక న్యాయం చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణపై సీజేఐ జస్టిస్ చంద్రచుడ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు రాష్ట్ర ప్రభుత్వం తరపున వర్గీకరణకు అనుకూలంగా తమ వాదనలు వినిపించేందుకు న్యాయవాదిని నియమించి మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో బృందాన్ని ఢిల్లీకి పంపినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి కార్యదర్శి గడ్డం సమ్మయ్య, హుజూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు తుడుపాటి లింగయ్య, జమ్మికుంట అధ్యక్షుడు పుట్టాల మల్లేశ్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లోకి జలాలు.. సాగులోకి పొలాలు


నిండుగా నారాయణపూర్ రిజర్వాయర్


నాటు వేసేందుకు సిద్ధం చేసిన పొలం

గంగాధర: నారుపోసి నీళ్లు వస్తే పొలాలు సాగు చేద్దామని ఎదురుచూసిన రైతాంగం... చెరువుల్లోకి నీళ్లు వస్తాయనే ధీమాతో పంటపొలాలు సాగు చేస్తే నీళ్లందక ఎండిపోతున్న పంట పొలాలను చూసి విలవిలలాడిన అన్నదాతలు... ప్రస్తుతం నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీరు వస్తుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రెండేళ్ల తర్వాత ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పంపింగ్ ద్వారా నారాయణపూర్ చెరువుతో పాటు గంగాధర ఎల్లమ్మచెరువులోకి నీరు చేరింది. చెరువుల్లోకి నీరు చేరుతుండటంతో నార్లుపోసి ఎదురుచూసిన రైతులు పొలాలు దున్ని నాట్లు వేస్తున్నారు. రెండోసారి నారు పోసిన రైతులు ప్రస్తుతం పొలాలు దున్నుతున్నారు. నారుసరిపోని రైతులు వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేస్తున్నరు. ఒక్కసారి చెరువు నిండితే పంట చేతకందే వరకు సాగునీటి సమస్య ఉండదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చెరువు కట్టలకు గండ్లు..

రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి ఎగువ ప్రాంతం నుంచి వరద ఉధృతి పెరగడంతో చెరువుకట్ట తెగిపోతే గ్రామానికి ప్రమాదమని అధికారులు చెరువుకు గండి పెట్టారు. ఇదే చెరువును ఆనుకొని ఉన్న ఎల్లమ్మ చెరువు సైతం వరద తాకిడికి గండి పడింది. రెండు చెరువుల గండ్ల పూడ్చివేతను గ్రామస్తులు అడ్డుకోవడంతో వర్షపు నీరు వృథాగా పోయింది. ఎల్లంపల్లి నీటికి నోచుకోక 2022 యాసంగికి నీరందలేదు. గ్రామస్తులను ఒప్పించి నారాయణపూర్ చెరువుకట్ట మరమ్మతులు చేయడంతో గతేడాది కొద్ది మంది రైతులకు వానాకాలం పంటలకు నీరందింది. ఎల్లమ్మచెరువు కట్ట మరమ్మతును మంగపేట గ్రామస్తులు అడ్డుకోవడంతో యాసంగిలో చెరువులోకి నీరు వెళ్లకుండా కట్టపోసి ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని నారాయణపూర్ చెరువుకు తరలించి పంటలకు నీరందించారు. గతేడాది చెరువుకట్టకు మరమ్మతు చేయక ఎల్లమ్మ చెరువులోకి వచ్చిన వర్షపు నీరు వృథాగా పోయింది. గత నెలలో ఎల్లమ్మచెరువు కట్ట మరమ్మతు పనులు పూర్తి చేశారు.

నిండుగా రిజర్వాయర్

రెండు చెరువుల కట్టల మరమ్మత్తు పనులు పూర్తి చేసి నందిమేడారం నుండి ఎల్లంపల్లి ప్రాజక్టు నీటి పంపింగ్‌ను గత నెల 29న ప్రారంభించారు. దాదాపు పది రోజులుగా పంపింగ్ ద్వార నీటిని తరలిస్తుండటంతో నారాయణపూర్ రిజర్వాయర్ నిండుతుంది. రిజర్వాయర్ నిండితే తూముల నుండి కాలువల ద్వార దిగువ ప్రాంతాల చెరువులు, కుంటలకు, పంటపొలాలకు నీరు చేరుతుంది. భూగర్భ జలాలు పెరిగడంతో పాటు, వ్యవసాయ బావుల్లో ఊట పెరుగుతుంది. తద్వార సాగునీటి సమస్య తీరనుంది. నారాయణపూర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన పంపింగ్ ద్వార ఎగువ ప్రాంతాలకు సైతం నీటిని తరలించే అవకాశం ఉంది.

పన్నులు వందశాతం వసూలు చేయాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్


చొప్పదండిలో పన్నుల వసూలు

హుజూరాబాద్: మున్సిపల్ పరిధిలో వందశాతం ఆస్తి పన్నులు వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు...ఆస్తి, నల్లా పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, యాడ్స్ ఫీజులు వందశాతం వసూలు అయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పురపాలక సంఘం చుట్టుపక్కల నూతనంగా వీధివ్యాపారుల కోసం స్ట్రీట్ వెండింగ్ జోన్ నిర్మాణానికి చైర్‌పర్సన్ గందె రాధికతో కలిసి స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజు, తహసీల్దార్ విజయ్‌కుమార్, కమిషనర్ సమ్మయ్య, మేనేజర్ రామ్మోహన్‌రాయ్, డెప్యూటీ ఈఈ ప్రభాకర్, ఇన్‌చార్జ్ మున్సిపల్ ఇంజినీర్ సాంబరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయం, పాఠశాల పరిశీలన

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని గ్రంథాలయం, మారుతినగర్‌లోని శ్రీసాయి మానసిక వికాలంగుల ప్రత్యేక పాఠశాలను అదనపు కలెక్టర్ బుధవారం పరిశీలించారు. గంథ్రాలయంలోని వసతులను పాఠకులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు లేవని పాఠకులు తెలపగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ను సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అనంతరం మూడేళ్ల క్రితం మూతపడిన మానసిక వికలాంగుల పాఠశాల పునఃప్రారంభం కోసం పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు సుత్రపు బుచ్చిరాములు విన్నపం మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. పాఠశాల నిర్వహణపై కలెక్టర్‌కు నివేదిక అందిస్తానన్నారు. వెంట ఆర్‌డీవో రాజు, తహసీల్దార్ రజని, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్ రావు, కమిషనర్ బి.శ్రీనివాస్, డీడబ్ల్యూవో సరస్వతి, వికలాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

చొప్పదండి: పట్టణంలోని గృహ యజమానులు ఇంటిపన్నులు సకాలంలో చెల్లించి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ కోరారు. పట్టణంలో పన్నుల వసూళ్లను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా పలువురు యజమానుల నుంచి పన్నులను సిబ్బంది స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో పన్నులు చెల్లించి బకాయిలు లేకుండా చూసుకోవాలని పట్టణ ప్రజలకు సూచించారు. వెంట మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి రూ.1.18 లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న మహేశ్ దంపతులు

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయానికి పట్టణానికి చెందిన మహేశ్ సూపర్ మార్కెట్ యజమాని పైడ మహేశ్, అర్చన దంపతులు బుధవారం రూ.1,18,116 విరాళం ప్రకటించారు. ఈమేరకు ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులకు నగదు అందించారు. దాతల ద్వారా అయ్యప్ప మాలధారణ భక్తులకు అన్నదానం చేసేందుకు ప్రత్యేకంగా సొసైటీ ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రావణ్‌కుమార్, అధ్యక్షుడు బొడిగె వెంకటేశ్, కమిటీ సభ్యులు చేపూరి సత్యనారాయణ, బొడిగె వెంకన్న, దండె సత్యానందం, ఉస్కె రాజశేఖర్‌రెడ్డి, కట్ట సత్యం పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్

శంకరపట్నం: సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ అనుపమ అన్నారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. జాతర స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులకు క్యూలైన్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, మహిళలకు స్నానాల గదులు ఏర్పాటు చేయాలని, మంచినీటి, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలన్నారు. జాతర సమయం దగ్గర పడుతున్నందున త్వరగా పనులు పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీవాణి, ఎంపీఓ బషీరొద్దీన్, జాతర కమిటీ చైర్మన్ గుర్రం స్వామి, ఏఎస్సై సుధాకర్, ఏఈ మొగిలి, వైద్యాధికారి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

భవనాల పరిశీలన



గన్నేరువరం: కేజీబీవీ నిర్వహణకు గన్నేరువరంతో పాటు గుండ్లపల్లిలోని భవనాలను బుధవారం ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, మండల ఇన్‌చార్జి విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. గన్నేరువరంలో మూడు భవనాలు, గుండ్లపల్లిలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల గదులను పరిశీలించారు. మండలానికి కేజీబీవీ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కృషితో మంజూరైందని, వారి ఆదేశాలతో తరగతుల నిర్వహణకు పరిశీలన చేశామని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సునీల్, నాయకుడు రాజేందర్‌రెడ్డి, కార్యదర్శి అశ్విని పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



హుజూరాబాద్: పట్టణానికి చెందిన పలువురు యువకులు సేవాభావంతో ఏర్పాటు చేసిన హుజూరాబాద్ హెల్ప్ టీం బృందం అనే సామాజిక సేవా కార్యక్రమానికి సంబంధించిన గ్రూపు పోస్టర్‌ను హుజూరాబాద్ టౌన్ సీఐ బొల్లం రమేశ్ బుధవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజ సేవ చేయాలనే సంకల్పంతో యువకులు హుజూరాబాద్ హెల్ప్ టీం అనే స్వచ్ఛంద సంస్థ నెలకొల్పి నిస్వార్థంగా సేవలు అందించడం అభినందనీయమన్నారు. గ్రూపు సభ్యులందరూ ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సామాజిక సేవ చేయాలని, భవిష్యత్‌లో మంచి గుర్తింపు దానంతటదే వస్తుందని సూచించారు. హుజూరాబాద్ హెల్ప్ టీంకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హుజూరాబాద్ హెల్త్ టీం సభ్యులు మునావర్, షఫీ, ఇర్ఫాన్, హర్షద్, బాబా, అఫ్రిద్, ఫరూక్, ఎస్‌కే షఫీ, రాఖీబ్, అబ్దుల్, సోహెల్ పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన


మాట్లాడుతున్న కార్యదర్శి రెడ్యానాయక్

జమ్మికుంట: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు విలువైనదని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్యానాయక్ అన్నారు. బుధవారం పత్తి మార్కెట్ కార్యాలయంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఇంట్లో వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రలోభాలకు లొంగకుండా మంచి నాయకులను ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రేడ్–2 కార్యదర్శి రాజా, సూపర్‌వైజర్స్ లక్ష్మణ్, యాకయ్య, అసిస్టెంట్ సూపర్‌వైజర్ ఎండీ సాబీర్ బాబా, అడ్తిదారుల సంఘం అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, అడ్తిదారులు, ఖరీదు వ్యాపారులు, హమాలీలు, దడ్వాయి కార్మికులు, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం


సన్మానిస్తున్న వార్డు కౌన్సిలర్, మహిళలు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి 20వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో వార్డు కౌన్సిలర్ దేశిని రాధాసదానందం ఆధ్వర్యంలో ఆయా పసునూటి అనసూర్యను బుధవారం శాలువాతో సత్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... ఇటీవల కలెక్టర్, సీడీపీవో చేతుల మీదుగా ఉత్తమ ఆయా పురస్కారం అందుకున్నారని, ఆమె మరిన్ని సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుమతి, సూపర్‌వైజర్ శిరీష, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శిక్షణ


సర్టిఫికెట్లు తీసుకుంటున్న నిరుద్యోగులు

మానకొండూర్: నిరుద్యోగులందరూ ఎంప్లాయిమెంటు కార్డు తీసుకోవాలని జిల్లా ఎంప్లాయిమెంటు అధికారి కె.దేవేందర్‌రావు కోరారు. మండల కేంద్రంలోని సుప్రీం ఫంక్షన్ హాల్‌లో నిరుద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ఉపాధి శిక్షణ డైరెక్టరేట్ నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సంకల్ప్ పథకం అమలులో భాగంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి బ్యాగులు, సర్టిఫికెట్లు అందజేశారు. డీఆర్‌పీ ఉమేశ్, ఏపీపీసీ ప్రతినిధులు నాసిర్ సిద్ధిఖీ, కోటేశ్, కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ జగదీశ్, ఎడ్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామడుగు: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో దైవాల పర్శారాం,పావని అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కూతుళ్లు అక్షర, కృషిత అనాథలయ్యారు. చిన్నారులకు పలువురు దాతలు అండగా నిలిచి ఆర్థికసాయంతో పాటు బియ్యం అందజేస్తున్నారు. మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన నేచర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం రూ. 27,011, 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ క్లబ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

గన్నేరువరం: గన్నేరువరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన హెచ్ఎం, ఉపాధ్యాయులకు బుధవారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం కట్టా రవీంద్రాచారి, ఉపాధ్యాయులు శ్రీలత, శరత్, బాలయ్య, తిరుపతి బదిలీపై వెళ్లగా వారిని శాలువాలతో సత్కరించారు. విద్యాబోధనతో పాటు ఇతర సాంస్కృతిక, కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహించారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తోటి ఉపాధ్యాయుల సహాయ సహకారాలు మరువలేనివని కట్టా రవీంద్రాచారి అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రామయ్య, శ్రీనివాస్‌రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ బుర్ర మల్లేశం, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొడ్డు సునిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గావ్ చలో అభియాన్

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామంలో మంగళవారం రాత్రి బీజేపీ నాయకులు గావ్‌చలో అభియాన్ కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికలకు ప్రతి కార్యకర్త సిద్ధం కావాలని బీజేపీ గెలుపు ధ్యేయంగా పని చేయాలని కోరారు. మండలంలోని బూత్ కమిటీ, సోషల్ మీడియా గ్రూప్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, సాయికృష్ణారెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లేశ్ ఆధ్వర్యంలో గావ్ చలో కార్యక్రమం బుధవారం నిర్వహించారు. 30వ వార్డు ప్రజలకు, చేనేత పారిశ్రామిక కార్మికులు , వివిధ కుల సంఘాల నాయకులు బీజేపీ కేంద్ర ప్రభుత్వం పథకాలను,సాధించి విజయాలను వివరించారు. బూత్ అధ్యక్షుడు ఎండీ రహీం, రవీందర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట: పట్టణంలోని కొత్తపల్లి క్రాస్ రోడ్డు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజేశ్ బుధవారం తెలిపారు. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం ఎంపేడు గ్రామం సమీపంలోని మానేరు వాగునుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు.

క్రీడాకారులకు టీషర్ట్స్

రామడుగు: మండల కేంద్రానికి చెందిన రామడుగు రాయల్స్ క్రికెట్ టీంకు గ్రామానికి చెందిన పూరెల్ల గంగరాజు బుధవారం టీషర్ట్స్ అందజేశారు. జట్టు సభ్యులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

గన్నేరువరంలో పోచమ్మ బోనాలు



గన్నేరువరం: మండల కేంద్రంలో సమ్మక్క సారలమ్మ జాతర కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో 21వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఈసందర్భంగా బుధవారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ పోషయ్య, వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి అంజయ్యగౌడ్, సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

సీఐగా బాధ్యతలు స్వీకరణ

చొప్పదండి: చొప్పదండి సీఐగా ఆర్ ప్రకాశ్‌గౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఇప్పటివరకు విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన జి.రవీందర్‌కు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సైదాపూర్: మండలంలోని గొడిశాలలో పాఠశాల క్యాలెండర్‌ను బుధవారం ఎంఈవో నర్సింహారెడ్డి ఆవిష్కరించారు. విద్యార్థులతో కూడిన క్యాలెండర్‌ను గ్రామస్తుల సహకారంతో ముద్రించి, ఆవిష్కరించారు. అనంతరం క్యాలెండర్లను విద్యార్థుల తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం నాయక్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం కార్యవర్గం

సైదాపూర్: సైదాపూర్ గౌడ కులసంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు బుధవారం మండల కేంద్రంలో నిర్వహించారు. సంఘం నూతన అధ్యక్షుడిగా కొండ మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా అనగోని రవీందర్, కోశాధికారిగా అనగోని శ్రీనివాస్, కార్యదర్శిగా బత్తిని భిక్షపతి, సభ్యులుగా ఆకుల రమేశ్, అనగోని కృష్ణ, కొలిపాక తిరుపతిని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు మల్లయ్య తెలిపారు.

కమ్యూనిటీ ఆధారిత కార్యకలాపాలు పెంచుతాం


ప్రయోగాన్ని వివరిస్తున్న జేఎన్‌వీ విద్యార్థులు

చొప్పదండి: కమ్యూనిటీ ఆధారిత కార్యకలాపాలను పెంచి విద్యార్థులకు పరిపుష్టి కలిగిస్తామని జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ మంగతాయారు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల విద్యాలయం, ఆర్నకొండ జిల్లా పరిషత్ విద్యాలయానికి చెందిన 80 మంది విద్యార్థులకు బుధవారం పేస్ సెట్టింగ్ ఆక్టివిటీస్‌లో భాగంగా నవోదయ విద్యాలయానికి ఆహ్వానించి బయాలజీ, కెమిస్ట్రీ, సైన్స్ లేబరేటరీలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయంలో విద్యార్థుల ద్వారా చేస్తున్న ప్రయోగాలను వివరించారు. నవోదయ విద్యాలయంలోని విద్యార్థులతో పాటు పొరుగున ఉన్న విద్యార్థులకు కూడా వనరులను పంచడం ఉద్దేశంతో పేస్ సెట్టింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులు అందజేశామన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ టీఎంకే రాయుడు, గోకా నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

గ్రామసభలు

సైదాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేకాధికారుల అధ్యక్షతన బుధవారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లోని సమస్యలు, చేపట్టాల్సిన పనులు తదితర అంశాలు చర్చించారు.

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్‌లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చిలుక రవీందర్, గ్రామ ప్రత్యేకాధికారి నరేందర్ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా నిర్వహించారు.

గన్నేరువరం: ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు గ్రామాల్లో చేపట్టే శానిటేషన్ కార్యక్రమాలపై సమీక్ష చేపట్టి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పనులను ప్రారంభించారు. హరితహారంలో చేపట్టిన వననర్సరీలు, అలాగే డంపింగ్‌యార్డులు, రైతు వేదికలు, మార్కెట్‌యార్డులను పరిశీలించారు.

రామడుగు: ప్రతి గ్రామంలో మురుగునీటికాలువలు శుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ కలిగేటి కవితలక్ష్మణ్ కోరారు. మండలంలోని కోరట్‌పల్లిలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. గ్రామాలలో శానిటేషన్‌తో పాటుగా రహదారులకు మరమ్మతులు, పాత బావులను పూడ్చివేసే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

జమ్మికుంట: అధికారులు, గ్రామస్తుల సహాయ సహకారాలతో ఆదర్శవంతమైన గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుకుందామని కోరపల్లి స్పెషల్ ఆఫీసర్, జమ్మికుంట తహసీల్దార్ రజని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 7నుంచి 15 వరకు నిర్వహించే ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో భాగంగా పంచాయతీ ఆవరణలో వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులతో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో అత్యవసర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధి కోసం పలు శాఖల వారీగా కమిటీ వేసుకోవాలని సూచించారు. అధికారులు, సోషల్ సర్వీస్‌పై ఆసక్తి గల వారితో భాగస్వామ్యం కావాలన్నారు. పారిశుద్ధ్యం, హరితహారం, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక కమిటీ వేసుకొని గ్రామస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు.